క్లుప్తంగా

ముంపు ప్రాంతాల్లో మంత్రి పర్యటన



పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ గురువారం స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి రాజీవ్‌నగర్, ఉడా కాలనీల్లో వరద ప్రాంతాలను పరిశీలించారు. వరదనీటిని యుద్ధ ప్రాతిపదికన బయటకు పంపివేయాలని, అవసరమైతే మోటార్లు పెట్టి తోడించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రను ఆదేశించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే బొండా ఉమా 64వ డివిజన్‌లో పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన భోజనాలను పట్టాభిరామ్‌తో కలిసి బాధితులకు పంపిణీ చేశారు. కాగా ఉడాకాలనీ రోడ్డు గోతులమయంగా ఉండటంతో మంత్రి కారు గోతిలో ఇరుక్కుపోయింది. ట్రాక్టర్ సాయంతో కారును బయటకు తీశారు.

వరద బాధితులకు ఎమ్మెల్సీ కుంభా సాయం



భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపులో సర్వం కోల్పోయిన బాధితులకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. వరద ముంపు ప్రాంతాల్లో ఒకటైన అజిత్‌సింగ్‌నగర్‌లో ఆయన గురువారం పర్యటించి బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అందరికీ సాయం అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ ఇళ్లు మునిగిపోయి కట్టుబట్టలతో బయటకు వచ్చేసిన తమలాంటి అసలైన బాధితుల వరకు రావడం లేదని పలువురు ఆయన దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్, ఏపీ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడుమల రామచంద్రయ్య, ఎన్‌టీఎఫ్ ప్రధాన కార్యదర్శి కుంభా ఉదయ్ కుమార్, ఎన్‌టీఎఫ్ నంద్యాల, నెల్లూరు జిల్లాల అధ్యక్షులు నాగసారి సుంకన్న, పులి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

చలపాకకు నందిపాటి వీరాచారి స్మారక పురస్కారం



చలపాక ప్రకాష్

విజయవాడ కల్చరల్: కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో రచయిత చలపాక ప్రకాష్‌కు 2024వ సంవత్సరానికిగానూ నందిపాటి వీరాచార్యులు స్మారక పురస్కారాన్ని 17వ తేదీ సోమవారం వన్‌టౌన్‌లోని మాడపాటి కల్చరల్ క్లబ్‌లో ప్రదానం చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు కేశనం భావన్నారాయణ, సభ్యుడు మందరపు పోతులూరి వీరాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 41 సంవత్సరాలుగా స్వర్ణకార వృత్తిని కొనసాగిస్తూ అనేక రచనలు చేశారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా తెలుగు సాహిత్యానికి విశేషమైన సేవలను అందిస్తున్నారని వారి సేవలను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇదే సభలో విశ్వకర్మ జయంతి సందర్భంగా గోలి వీర చంద్రరావు స్మారక పురస్కారాలను అవ్వారు శ్రీనివాసరావు, జనాబ్ మహ్మద్ పాషాలకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



పాయకాపురం(విజయవాడరూరల్): ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం కండ్రికలో వరదలకు ఇళ్లు మునిగి నష్టపోయిన 100 కుటుంబాలకు రూ. 1,500 చొప్పున ప్రకాశం జిల్లా సంఘం సభ్యులు రూ. 1.50 లక్షలను అందజేశారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవూరి రామస్వామి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకొనేందుకు సంఘం కృషి చేస్తుందన్నారు. ప్రకాశం జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి సుత్తారం శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు నల్లగట్ల ఈశ్వరచారి, రాష్ట్ర కార్యదర్శి పొన్నపల్లి బ్రహ్మానందం, సింగ్‌నగర్ సభ్యులు పాల్గొన్నారు.

14న కవయిత్రి మొల్ల కాంస్య విగ్రహావిష్కరణ

విజయవాడరూరల్: ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ శనివారం రామాయణ కావ్య జనయిత్రి, తొలి తెలుగు కవయిత్రి మొల్ల కాంస్య విగ్రహావిష్కరణ విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు బొమ్మిన శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పేర్కొన్నారు.

తప్పని వరద తిప్పలు



రామరాజ్యనగర్‌లో ఇంకా మురుగునీటిలోనే ఉన్న ఇళ్లు



తోట వారి వీధిలో చెత్తను జేసీబీ ద్వారా తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

వరద ముంపు ప్రాంతాల్లో నీరు లాగేయగానే ప్రభుత్వం ఆహారం, మంచినీటి సరఫరా నిలిపివేసింది. నీరు పోయినా బురద కొట్టుకుపోయిన ఇళ్లు, సామాన్లను శుభ్రం చేసుకోవడంతోనే సరిపోతున్న బాధితులకు వంట చేసుకునే సమయమేది...ఒకవేళ వంట చేసుకుందామన్నా పొయ్యి పనిచేయదాయె..పొయ్యి పనిచేసినా చేతిలో చిల్లిగవ్వ లేదాయె...ఈ నేపథ్యంలో గురువారం ముంపు ప్రాంతాల్లో ఎటు వెళ్లినా ఆకలికేకలే వినపడుతున్నాయి. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



సుందరయ్య నగర్‌లో వరదముంపునకు గురైన వంట సామాన్లు



పాయకాపురంలో ఉచిత వస్తువుల కోసం ఎగబడుతున్న వరద బాధితులు



సింగ్‌నగర్‌లోని ఇందిరానాయక్ నగర్‌లో పాడైన ఇళ్లకు వరద నష్టం అంచనా వేస్తున్న అధికారులు

సీతారాం ఏచూరి మరణ వార్త దిగ్భ్రాంతికి గురిచేసింది

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడ సెంట్రల్): నిరాడంబరుడు, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణవార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతారాం ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. నిత్యం ప్రజా సమస్యలపై గళం విప్పుతూ.. ఎగువ సభలో గుర్తింపు పొందారన్నారు. ఆయన మరణం కార్మిక లోకానికి తీరని లోటని అన్నారు. ఏచూరి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ.. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు నివాళులర్పించారు. ఆయన మృతి వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటు అన్నారు. విజయవాడ నగరంతో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. నగర పార్టీ తరఫున సీతారాం ఏచూరి సంతాపం తెలియజేశారు.

సహాయ కార్యక్రమాల్లో సహకరించిన వారికి కృతజ్ఞతలు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



పటమట(విజయవాడతూర్పు): బుడమేరు వరద నుంచి విజయవాడ సత్వరం కోలుకునేందుకు సహాయ కార్యక్రమాలు చేసిన అందరికీ వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. నగర వ్యాప్తంగా ఉన్న 64 డివిజన్లలో 32 డివిజన్లలో వరద ప్రభావితం ఉందని చెప్పారు. నగరంలో ఉన్న ఐదు డ్రైనేజీ పంపింగ్ స్టేషన్లు, కేఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్ (విజయవాడ నగరంలో తాగునీటిని సరఫరా చేసే ప్రధాన హెడ్ వాటర్ వర్క్స్) వరద ప్రభావానికి పాడైపోయిందని, దీన్ని త్వరితగతిన పరిష్కరించామన్నారు. వీఎంసీలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేటట్టు వారి సమస్యలను పరిష్కరించేందుకు, ఫిర్యాదులకు హెల్ప్ లైన్ నంబర్లు పెట్టడమే కాకుండా సామాజిక మాధ్యమం ద్వారా కూడా ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నవారికి ప్రత్యేకంగా 50 ట్రాక్టర్లతో ఆహారాన్ని అందించామని, 230 ట్యాంకర్లతో తాగునీటిని సరఫరాను చేశామన్నారు. ట్రాక్టర్లు వెళ్లలేని చోట 11 మత్స్యశాఖ బోట్లలో ఆహారాన్ని తీసుకువెళ్లి అవసరమైన ప్రతి ఒక్కరికీ అందించామన్నారు. కొన్ని ప్రదేశాలలో బోట్లు కూడా వెళ్లలేని పరిస్థితి ఉన్నప్పుడు డ్రోన్ల సహాయంతో ఆహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శివారు ప్రాంతాలకు హెలికాప్టర్ ద్వారా ఆహారాన్ని అందించామన్నారు. వరదలతో ప్రజలతో పాటు మూగ జీవాలను కూడా కాపాడే చర్యలు తీసుకున్నామని, వరద అనంతరం ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు, దోమల నియంత్రణకు డ్రోన్ల సహాయంతో ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే, ఫాగింగ్ చేస్తూ, యాంటీ లార్వా ఆపరేషన్స్ చేసినట్లు వివరించారు. 352 ఆయిల్ ఇంజన్స్ తో నిలువ ఉన్న వరద నీరును అధికారులు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారని, 462 వాహనాలతో వరదల వల్ల పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ, ప్రత్యేకమైన పాయింట్లో డీసిల్టింగ్ చేసుకుంటూ, వరదనీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

స్కూల్స్ అన్నీ బురదమయం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ ప్రాంతాలను వరద నీరు వదిలినా.. బురద మాత్రం ఇంకా వీడటం లేదు. ప్రధానంగా సింగ్‌నగర్, వాంబేకాలనీ, న్యూరాజరాజేశ్వరీపేట, శాంతినగర్, ఎల్‌బీఎస్‌నగర్, రాజీవ్‌నగర్, కండ్రిక ప్రాంతాల్లోని పాఠశాలలన్నీ నీట మునిగాయి. ఈ స్కూల్స్‌లోని బీరువాల్లో దాచిన స్కూల్ రికార్డ్స్‌తోపాటు తరగతి గదుల్లో పిల్లలు దాచుకున్న పుస్తకాలు, బ్యాగులు మొత్తం తడిచి పాడైపోయాయి. దీంతో ఇక్కడి ప్రైవేటు స్కూల్స్ అన్నీ సోమవారం వరకూ సెలవులు ప్రకటించి తరగతి గదులను బాగుచేసే పనిలో పడ్డారు. ప్రభుత్వం టెస్ట్ పుస్తకాలు, నోట్ పుస్తకాలు కోల్పోయిన విద్యార్థులకు తిరిగి వాటిని అందించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇళ్ల మధ్యే వ్యర్థాల డంపింగ్



పాయకాపురం(విజయవాడరూరల్): వరదల్లో కొట్టుకొచ్చిన వ్యర్థాలను ఇళ్ల మధ్య డంప్ చేయడాన్ని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. బుడమేరు వరదల్లో దూర ప్రాంతాల నుంచి కొట్టుకొచ్చిన వ్యర్థాలను విజయవాడ నగరంలోని 63వ డివిజన్ రాజీవ్‌నగర్ కట్టమీద డంప్ చేయడంతో దుర్వాసన వస్తోందని, ఆ వ్యర్థాల కోసం పందులు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రచారం చేస్తూ.. వారే చుట్టుపక్కల నుంచి లారీలు, ట్రాక్టర్లతో ఇళ్ల మధ్య వ్యర్థాలు డంప్ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాజీవ్‌నగర్ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ఇక్కడ డంప్ చేయొద్దని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి రెండు నిమిషాలకు వాహనాలు పెద్ద పెద్ద శబ్దం చేసుకొంటూ రాకపోకలు సాగించడం వల్ల శబ్దకాలుష్య సమస్యలు కూడా ఉత్పన్నం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

62వ డివిజన్‌లో ఎన్యూమరేషన్

పాయకాపురం(విజయవాడరూరల్): వరదల్లో నష్టపోయిన వారికి గురువారం 62వ డివిజన్ పార్కు రోడ్డు, పోలీసుస్టేషన్ రోడ్డులో చెట్ల కింద కూర్చొని ఎన్యూమరేషన్ సిబ్బంది బాధితులకు సమాచారం పంపి వివరాలను సేకరించారు. బాధితుల ఆధార్‌కార్డులోని వివరాల ప్రకారం నష్టంపై ఎన్యూమరేషన్ చేశారు. ఇళ్లన్నీ ఇంకా వరద, బురదల్లో ఉండటంతో ఆ మురుగునీటిలోకి వెళ్లి వివరాలను సేకరించాలంటే అంటువ్యాధులు సోకుతాయనే భయంతో చెట్ల కింద ఎన్యూమరేషన్ చేస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. బాధితులు సర్వస్వం కోల్పోయినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమాజ హితమే సంస్కార భారతి లక్ష్యం



కళాకారులకు ఆర్థిక సహాయ కార్యక్రమంలో డాక్టర్ పీవీఎన్ కృష్ణ, దర్భా శ్రీనివాస్ తదితరులు

విజయవాడ కల్చరల్: సమాజ హితమే లక్ష్యంగా సంస్కార భారతి సాంస్కృతిక సేవా సమితి పనిచేస్తుందని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ అన్నారు. సంస్కార భారతి ఆధ్వర్యంలో అయోధ్యనగర్‌లోని రాష్ట్రీయ స్వయం సేవక్ కార్యాలయం హైందవిలో గురువారం వరద బాధిత ప్రాంతాల్లోని కళాకారులకు రెండవ విడత ఆర్థిక సహాయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన కృష్ణ మాట్లాడుతూ కళాకారులను ఆదుకోవడానికి ముందుకు రావాలని సాంస్కృతిక సంస్థలకు పిలుపునిచ్చారు. కళాకారులను, సంగీత సాహిత్యాలను గౌరవించిన చోట ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందన్నారు. సంస్కార భారతి ప్రధాన కార్యదర్శి దర్భా శ్రీనివాస్ సామాజిక చైతన్యం కళాకారులతోనే సాధ్యమన్నారు. అనంతరం 30 మంది కళాకారులకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో శ్రీరాం పాఠశాలల వ్యవస్థాపకుడు సురేష్, సంస్థ ప్రతినిధులు జొన్నవిత్తుల రామకృష్ణ, సీతారత్నం, విశ్వకాంత్ పాల్గొన్నారు.

సింగ్‌నగర్‌లోకి వరదనీరు



రోడ్డును పగలకొట్టి నందమూరినగర్‌లోకి వదులుతున్న అంబాపురంలోని వరదనీరు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అంబాపురం గ్రామ ముంపు ప్రాంతాల గురించి సాక్షి పత్రికలో వరుస కథనాలు రావడంతో స్పందించిన అధికార యంత్రాంగం అక్కడ నిలిచిపోయిన వరద నీటిని తొలగించేందుకు ఏర్పాట్లు చేశారు. సింగ్‌నగర్ అంబాపురం మధ్యలో ఉన్న వంద అడుగుల ఇన్నర్ రింగ్ రోడ్డును పది చోట్ల పగలకొట్టి అంబాపురం గ్రామంలో నిలిచిన వరదనీటిని సింగ్‌నగర్ తోటవారి వీధి వెనుక వైపునకు వదిలారు. దీంతో ఈ రోడ్డు మీద నుంచి సింగ్‌నగర్ పైపులరోడ్డు, జక్కంపూడి, అంబాపురం, మైలవరం ప్రాంతాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అంబాపురంలో నిలిచిన వరదనీటిని మళ్లీ సింగ్‌నగర్ వైపు మళ్లించడంతో తమ ప్రాంతాలు ఏమైనా ముంపునకు గురవుతాయా అని నందమూరినగర్, తోటవారి వీధి ప్రాంతాల్లోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. బుడమేరు మీదుగా ఈ నీరంతా సింగ్‌నగర్ నుంచి ముందుకు వెళ్లిపోతుందని అధికారులు చెప్పడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. అయితే నందమూరి నగర్ చివరి ప్రాంతాల్లోని కొన్ని ఇళ్లకు ఈ వరదనీరు తాకే ప్రమాదం ఉంది. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

పారిశుద్ధ్య నిర్వహణపై ఆకస్మిక తనిఖీ

వ్యర్థాలను సత్వరమే తొలగించాలి



బైక్‌పై వెళ్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వరదతో ఏర్పడిన వ్యర్థాలను తొలగించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరించారు. ఆయన గురువారం వరద ప్రభావిత ప్రాంతాలైన గుణదల, సింగ్‌నగర్, శాంతినగర్, సన్‌రైజ్ కాలనీ, పాత రాజరాజేశ్వరి పేట, కొత్త రాజరాజేశ్వరి పేట, పైపులు రోడ్డు, ప్రకాష్ నగర్, రాజీవ్ నగర్, రామవరప్పాడు, కండ్రిక, వాంబే కాలనీ, ఉడా కాలనీలలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వార్డు సచివాలయాల కార్యదర్శులతో పాటు ఆయన బైకుపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని, వరద వ్యర్థాలను త్వరితగతిన తొలగించాలని పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఇతర మున్సిపాలిటీల నుంచి వచ్చిన కార్మికులతో ఆయన మాట్లాడారు. వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. భోజనం, వసతిపై ఆరా తీశారు. పర్యటనలో కండ్రికలో ప్రజలు తాగునీటి సరఫరాపై కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే ఆయన స్థానికంగా నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.

ముంపు ప్రాంతాల్లో ఆకలి కేకలు!

- భోజనం సరఫరా నిలిపివేసిన ప్రభుత్వం
- దాతలపైనే ఆధారపడుతున్న వరద బాధితులు



దాతలు పంచుతున్న ఆహారం కోసం ఎగబడుతున్న బాధితులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపు ప్రాంతాల్లో ప్రస్తుతం ఆకలి కేకలు అధికంగా వినిపిస్తున్నాయి. ముంపునకు గురైన సింగ్‌నగర్, ఇందిరానాయక్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ, శాంతినగర్, రాజీవ్‌నగర్, ఎల్‌బీఎస్‌నగర్, రాజీవ్‌నగర్, ఉడాకాలనీ, కండ్రిక ప్రాంతాల్లో పలు చోట్ల వరద నీరు అలానే ఇళ్లల్లో ఉండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం భోజనం వండుకొనే పరిస్థితి కూడా లేదని వాపోతున్నారు. బాధితులకు అందించే ఆహారం, తాగునీటిని ప్రభుత్వం గత మూడు రోజుల నుంచి సరఫరా చేయడం నిలిపివేసింది. దీంతో ఆకలితో అలమటించాల్సిన దుస్థితి ఏర్పడింది. తమ ప్రాంతాల్లో దాతలు పంచే ఆహారం కోసం బాధితులు ఎదురుచూస్తున్నారు.

సర్వం కోల్పోయాం



వరదల వల్ల ఇళ్లల్లో ఉన్న వస్తువులన్నీ కోల్పోయాం. కనీసం ఇంట్లో నిలబడటానికి కూడా అవకాశం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఇక భోజనాలు ఎక్కడ వండుకుంటాం. కనీసం మరో వారం రోజులైనా ప్రభుత్వం ముంపు ప్రాంతాల్లోని ప్రజలకు ఆహారం సరఫరా చేస్తే బాగుంటుంది.

–షేక్ బాబు, సింగ్‌నగర్.

ఆకలితో దుర్భర పరిస్థితులు



వరద బాధితులకు ప్రభుత్వం నుంచి ఏ సాయం సక్రమంగా అందలేదు. న్యూరాజరాజేశ్వరీపేటలోని అరుణోదయనగర్, జామాతోట, సుందరమ్మ దిబ్బ, అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లోని ప్రజలంతా ఆకలితో దుర్భర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది. మా ఇళ్లలు పూర్తిగా బాగుపడే వరకూ ప్రభుత్వం ఆహారం అందించాలని కోరుతున్నాం.

–కె.భాయమ్మ, న్యూరాజరాజేశ్వరీపేట

వరద బాధితులకు ఆపన్న హస్తం



సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద అన్నదానం చేస్తున్న కళ్లే నాగేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు



పైపులరోడ్డులో అన్నదానం చేస్తున్న సీపీఐ నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కళ్లే లలితా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద బుడమేరు వరద బాధితులకు గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు కళ్లే నాగేశ్వరరావు మాట్లాడుతూ బుడమేరు ముంపునకు గురైన ప్రాంతాల్లోని ప్రజలకు ఆపన్న హస్తం అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ట్రస్ట్ సభ్యులు ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్, జి.ధృవన్ పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా గుర్తించాలి

బుడమేరు వరదను జాతీయ విపత్తుగా పరిగణించి, బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. అక్షయ, గుప్తా ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సింగ్‌నగర్ పైపులరోడ్డులో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించాలని దీని ద్వారా వరద బాధితులకు ఎక్కువ సహాయం చేసే అవకాశం లభిస్తుందన్నారు. సీపీఐ నాయకులు నక్క వీరభద్రరావు, కె.వి. భాస్కరరావు, కె.ఆర్.ఆంజనేయులు, మూలి సాంబశివరావు, శివకుమార్, సీహెచ్ గురవయ్య, పి.నాగరాజు పాల్గొన్నారు.

అనంత లక్ష్మి సేవా సంఘం ఆధ్వర్యంలో..

బుడమేరు వరద బాధితులకు అనంత లక్ష్మి సేవా సంఘం ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు గురువారం పంపిణీ చేశారు. సింగ్‌నగర్ వివేకానంద స్కూల్ ఆవరణలో ఆ ట్రస్ట్ చైర్మన్ పెనుమత్స అప్పలరాజు చేతులమీదుగా బాధితులకు కిట్లను అందించారు. వీరితోపాటు వివేకానంద స్కూల్ సిబ్బంది సింగ్‌నగర్‌లోని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా సభ్యులకు కిట్లను పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు రాఘవరాజు, నవనీతం సాంబశివరావు, కె.రామరాజు పాల్గొన్నారు.

ఆహారం, దుస్తుల పంపిణీ

గుంటూరు సీతానగరంలోని గాస్పెల్ చర్చ్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్, అంబాపురం పరిధిలోని బాధితులకు ఆహార పొట్లాలు, దుస్తులను గురువారం చర్చ్ పాస్టర్ రెవ. డాక్టర్ శ్యాంసన్ రాబర్ట్స్ కింగ్‌డమ్ చేతులమీదుగా అందజేశారు.

సత్యసాయి సేవా సంస్థల కిట్లు పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరదల్లో సర్వం కోల్పోయిన బాధితులకు సత్యసాయి సేవా సంస్థలు సాయం అందించాయి. బియ్యం, కందిపప్పు, నూనె వంటి 20 రకాల వస్తువులతో కూడిన 7వేల అమృత కలశం కిట్లను గురువారం బాధితులకు పంపిణీ చేసింది. న్యూరాజరాజేశ్వరిపేట, శాంతినగర్, వాంబే కాలనీ తదితర ప్రాంతాల్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ కిట్లను అందజేశారు. సంస్థ నేషనల్ సేవ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు సురేంద్ర, రాష్ట్ర సేవాదళ్ సమన్వయకర్త శ్యాంప్రసాద్, నాగప్రసాద్, వివిధ జిల్లాల అధ్యక్షులు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం దాతల సహకారంతో భక్తులు, వరద బాధితులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

మార్కెట్‌లోకి హ్యుందాయ్ అల్‌కజార్



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): కుశలవ హ్యుందాయ్ షోరూం ది బోల్డ్ న్యూ హ్యుందాయ్ అల్‌కజార్ కారును మార్కెట్‌లోకి విడుదల చేసింది. గురువారం కుశలవ హ్యుందాయ్ మేనేజింగ్ డైరెక్టర్ చుక్కపల్లి సిద్ధార్థ్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ప్రవీణ్, యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా చుక్కపల్లి సిద్ధార్థ మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అల్‌కజార్ రూపొందించారన్నారు. 70కు పైగా సేఫ్టీ ఫీచర్లు, ఆకర్షణీయమైన డిజైన్, ఎడాస్‌లెవెల్–2 అనే 19 సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయన్నారు. ఫస్ట్, సెకండ్ రో వైర్‌లెస్ చార్జర్‌తో, 2 రకాల ఇంజిన్లు(1.5 టర్బో, 1.5 డీజిల్) అందరికీ అందుబాటు ధరలో లభిస్తోందన్నారు. కొత్త హ్యుందాయ్ అల్‌కజార్ ప్రారంభ ధర రూ. 14.99లక్షలు(పెట్రోల్ ఎక్స్ షోరూం), రూ. 15.99 (డీజిల్ ఎక్స్ షోరూం ధర) లభిస్తాయన్నారు. టెస్ట్ డ్రైవ్ కోసం దగ్గరలోని కుశలవ షోరూంలో సంప్రదించాలని కోరారు.